రాష్ట్ర కార్యవర్గంతో నూతన కార్యవర్గ సభ్యులు

అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్, మార్చి 11: జిల్లా కేంద్రంలోని కళాభారతిలో సోమవారం అంబేద్కర్ యువజన సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘ వ్యవస్థాపకుడు జేబీ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య, ప్రధాన కార్యదర్శి నాగరాజు, అంబేద్కర్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్నయ్య, జాయింట్ సెక్రటరీ హరిప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లా కమిటీని రద్దుచేసి నూతన కమిటీని ఎన్నుకునారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడిగా కొత్తోళ్ల గంగారాం, ప్రధాన కార్యదర్శిగా గైనిరాజు, కోశాధికారిగా పెరుమాండ్ల రాములు, గౌరవ అధ్యక్షులుగా కొత్తపల్లి మల్లన్న, రాజలింగంతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేసిన హెల్పింగ్ బ్రిడ్జ్ సంస్థ ప్రతినిధులు

రాజంపేట్/నస్రుల్లాబాద్, మార్చి 11: రాజంపేట్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విజయ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రహమత్ అహ్మద్, ఎల్వీ కృష్ణారావు, అన్వేశ్‌రావు, కృష్ణాకర్‌రావు, రహమత్ హుస్సేన్, ఆదాం, హెచ్ఎం ఈశ్వర్ పాల్గొన్నారు. నస్రుల్లాబాద్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 24 మంది విద్యార్థులకు డీఎఫ్‌సీఎస్ జిల్లా డైరెక్టర్ జయశ్రీ పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండ్ల సాయిలు, భరత్ కుమార్, హెచ్ఎం చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుకోసం కృషిచేయాలి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

బాన్సువాడ టౌన్, మార్చి 11: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం నిలబడాలన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, హన్మాండ్లు, శివశంకర్ పాల్గొన్నారు.

పాకురు నీళ్లు.. జనం బెంబేలు

- శుద్ధి చేయకుండానే తాగునీటి సరఫరా
- పట్టణ ప్రజల ఆగ్రహం

ఆకుపచ్చ రంగులో పాకురు పట్టిన తాగునీటిని చూపిస్తున్న కాలనీవాసులు

కామారెడ్డి, మార్చి11: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో సరఫరా చేస్తున్న తాగునీటిని చూసి జనం బెంబేలెత్తి పోతున్నారు. పెద్ద చెరువు నుంచి ఆర్డీవో ఆఫీస్ వెనుక ఉన్న రెండు వాటర్ ట్యాంకులతోపాటు గడి వాటర్ ట్యాంకు ద్వారా వారం రోజులుగా ఆకుపచ్చ రంగులో పాకురుపట్టిన నీరు రావడంపై ఆయా కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా సమధానం చెబుతున్నారని వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కరోజు కూడా ఇలాంటి సమస్య రాలేదని గుర్తుచేశారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధిచేసి తాగునీటిని అందించేవారని తెలిపారు. ప్రభుత్వం మారిన నుంచి అధికారుల్లో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తున్నదని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. పట్టణ ప్రజలు నల్లాల ద్వారా సరఫరా చేసే నీటినే తాగుతారని, ఉన్నతాధికారులు స్పందించి ఇకనైనా శుద్ధి చేసిన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం నిర్వహించిన హరినామ సప్తాహంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. భక్తులతో కలిసి హరినామ కీర్తలను ఆలపించారు. ఆయన వెంట సర్పంచ్ శ్రావణ్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

–బాన్సువాడ టౌన్, మార్చి 11

ఇంటర్ పరీక్షలకు 514 మంది గైర్హాజరు

కామారెడ్డి, మార్చి 11: జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 10,208 మంది విద్యార్థులకు 9,694 మంది హాజరయ్యారు. 514 మంది గైర్హాజరైనట్లు నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. 8587 మంది జనరల్ విద్యార్థులకు 8214 మంది, 1621 మంది వొకేషనల్ విద్యార్థులకు 1480 మంది హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్.. ఇద్దరికి గాయాలు

కామారెడ్డి, మార్చి 11: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఓ ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. నలుగురు ప్రయాణికులతో పెద్దమల్లారెడ్డికి వెళ్తున్న ఆటోను ఓ ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో వేగంగా వెళ్లి ముందున్న మరో బస్సును ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటో ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్ సహా ప్రయాణికులు ఇరుక్కుపోయారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని సురక్షితంగా బయటికి తీశారు. ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కొంతసేపు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోగా పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బీబీపేట్, మార్చి 11: మండల కేంద్రంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధి బాశెట్టి నాగేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఆక్యుపంక్చర్, నేచురోపతి చికిత్స చేస్తారని పేర్కొన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

ఎల్లారెడ్డి/ సదాశివనగర్/ మాచారెడ్డి, మార్చి 11 : మాచారెడ్డి, పాల్వంచ, ఎల్లారెడ్డి, సదాశివనగర్ మండలాలకు బీజేపీ అధ్యక్షులను సోమవారం నియమించారు. మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా బూస సురేశ్, పాల్వంచకు పోసు అనిల్, ఎల్లారెడ్డికి నర్సింహులు, సదాశివనగర్‌కు కుంట రాంరెడ్డి అధ్యక్షులుగా నియమితులయ్యారు. వారికి పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

కామారెడ్డి, మార్చి 11: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు కాంగ్రెస్ కౌన్సిలర్లు సోమవారం అవిశ్వాస నోటీసును అందజేశారు. అవిశ్వాస ప్రక్రియకు అనుమతించాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కోరారు. మొత్తం 49మంది కౌన్సిలర్లు ఉండగా 27మంది తమ సంతకాలతో కూడిన నోటీసును అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 48 ఫిర్యాదులు

కామారెడ్డి, మార్చి 11: పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 48 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలు అందజేసిన అర్జీలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తోపాటు జిల్లాస్థాయి అధికారులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పరిశీలించి ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి

రెవెన్యూ అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 11: ధరణి పోర్టల్‌కు సంబంధించి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించి వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆర్డీవో, ఎమ్మార్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి భూ తగాదాలకు తావివ్వొద్దని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాఠశాల తనిఖీ..

బీబీపేట్, మార్చి 11: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఉదయం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, హాజరు పట్టిక, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలని పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

నివేదికను చదివి వినిపిస్తున్న విండో కార్యదర్శి గంగాధర్

విండో అభివృద్ధికి కృషిచేయాలి

డోంగ్లీ, మార్చి11: సహకార సంఘం అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని డోంగ్లీ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ రామ్‌పటేల్ అన్నారు. విండో మహాజన సభను సోమవారం నిర్వహించారు. కార్యదర్శి గంగాధర్ సొసైటీ జమాఖర్చులను చదివి వినిపించారు. అనంతరం సభ్యులు పలు అంశాలపై చర్చించారు. దీర్ఘకాలిక రుణాలు, మొండి బకాయిలు వసూలు చేయాలని తీర్మానించారు. సమావేశంలో విండో వైస్ చైర్మన్ విజయ్ పటేల్, మాజీ చైర్మన్ అశోక్ పటేల్, సిబ్బంది వీరేశ్, ప్రవీణ్, ఈర్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొమలంచలో పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నిజాంసాగర్/ రాజంపేట్/ బీబీపేట్, మార్చి 11: మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.ఐదు లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను మాజీ జడ్పీటీసీ జయప్రదీప్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో రూ. 10లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, ఎంపీటీసీ నర్మల రాజు, శివకుమార్, కృష్ణారెడ్డి, రాజలింగం, నర్సింహులు, భిక్షపతి, యశ్వంత్, గోపాల్, జలేంధర్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు. బీబీపేట్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సూతరి రమేశ్, గ్రామ అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో సేవాలాల్ జయంతి వేడుకలు

వివరాలను వెల్లడిస్తున్న బంజారా నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 11: ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు బంజారా నాయకులు తెలిపారు. ఈమేరకు సోమవారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేసి వేడుకల విషయమై చర్చించారు. ఎల్లారెడ్డిలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ఆర్డీవో మన్నె ప్రభాకర్ పాల్గొంటారన్నారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బంజారా సంఘం మండల అధ్యక్షుడు లింబేస్ రాథోడ్, గన్యా, శంకర్, బాబూసింగ్, సురేందర్, సక్రూ, గోవింద్, పరశురాం, హరిలాల్, పీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

డోంగ్లీ, మార్చి 11: మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు తహసీల్దార్ రేణుకా చౌహాన్ సోమవారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాన్ని పట్టుకున్నామని, వాటిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

20వరకు ఇంటి పన్ను వసూలు పూర్తిచేయాలి

పిట్లం, మార్చి 11: మండలంలో ఇంటి పన్ను వసూలును ఈనెల 20వ తేదీలోపు పూర్తిచేయాలని మండల పంచాయతీ అధికారి బ్రహ్మం అన్నారు. సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. విశ్వకర్మ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

మహిళలకు సన్మానం

రామారెడ్డి, మార్చి11: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రామారెడ్డిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖలో మహిళా ఉద్యోగులను, రామారెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో సవితారాణితోపాటు ఎనిమిది మంది మహిళలను తోటి ఉద్యోగులు శాలువాలు కప్పి సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో లావణ్య, స్రవంతి, స్వర్ణలత, విజయలక్ష్మి, మౌనిక, హరిలత, రజిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం

పిట్లం, మార్చి 11: మండలకేంద్రంలోని జాతీయ రహదారి వెడల్పు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం ప్రారంభించారు. జేసీబీ, డోజర్ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించి చిరు వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. పనులు చేపడుతున్న సందర్భంగా వ్యాపారులు దుకాణాలు మూసిఉంచారు. రోడ్డు వెడల్పు పనులు పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని వాహనదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

దుకాణ సముదాయాల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న విండో చైర్మన్ సదాశివారెడ్డి

దుకాణ సముదాయాల నిర్మాణ పనులు ప్రారంభం

సదాశివనగర్, మార్చి 11: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక సహకార సంఘంలో నూతన దుకాణ సముదాయ నిర్మాణ పనులను విండో చైర్మన్ మర్రి సదాశివారెడ్డి సోమవారం ప్రారంభించారు. వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా దుకాణాలను నిర్మిస్తున్నామని విండో చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మ న్ పశుపతిచారి, ఎంపీటీసీ సంకరి లక్ష్మీ రాజలిం గం, విండో డైరెక్టర్లు భాస్కర్, ఎల్ల నర్సవ్వ, ఉమామహేశ్వర్ రావు, బత్తుల రాములు, గుర్జాల నారాయణ రెడ్డి, వంగ ప్రవీణ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వీడీ సీ అధ్యక్షుడు ఎల్ల నర్సింహులు, సొసైటీ సీఈవో కడెం భైరయ్య, సిబ్బంది లింగామూర్తి, భైరేష్, గంగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

నిజాంసాగర్/ గాంధారి, మార్చి11: నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న నువ్వుల పంట ను ఏఈవో రేణుక సోమవారం పరిశీలించారు. పంటను లద్దె పెరుగు ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు క్లోరోఫైరిఫాస్ మందును ఎకరాకు 500 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, లేదా క్వినాల్ఫాస్ ఎకరాకు 400 మిల్లీలీటర్ల మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం వరిని పరిశీలించారు. వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేస్తే పురుగుల బెడద ఉండదని, అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. పొట్టదశలో ఉన్న పంటకు తెల్ల కంకి రాకుండా కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. గాంధారి మండలంలోని పొతంగల్ కలాన్ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న వరిని మండల వ్యవసాయాధికారి నరేశ్ పరిశీలించారు. వరికి కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించారు. నివారణ చర్యలను వివరించారు. ఆయనవెంట ఏఈవో షోయబ్ అహ్మద్, రైతులు ఉన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నిజాంసాగర్, మార్చి11: మండలంలోని అచ్చంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రమేశ్ పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. రమేశ్ ఇదే పాఠశాలలో చదివి ప్రస్తుతం నాగిరెడ్డిపేటలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి మంచిమార్కు లు సాధించాలని కానిస్టేబుల్ రమేశ్ సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★అక్వా అక్షర పవన్ ఎంటర్‌ప్రైజెస్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. Age 18-45 Years, సాలరీ మార్కెటింగ్ స్కిల్స్ బట్టి 10K- 40K వరకు ఉంటుంది. Only 6 hours time © 9121825513
NTZ-324729
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బడ్జెట్‌కు ఆమోదం

మాట్లాడుతున్న బల్దియా చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి, మార్చి 11: బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం ఎల్లారెడ్డి మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రూ.5.3370కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. రాబడి, వ్యయాలపై చర్చించారు. సమావేశంలో బల్దియా కమిషనర్ శ్రీహరి రాజు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సుజాత, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మేనేజర్ వాసంతి, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు

చెత్తను డంప్ చేస్తున్న ట్రాక్టర్

డోంగ్లీ, మార్చి 11: 'డంపింగ్ పై నిర్లక్ష్యం' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దిన పత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెత్త రోడ్డు పక్కనే వేయడంతో ప్రమాదాలకు కారణమవుతుందని పత్రికలో వార్త రావడంతో పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించారు. చెత్తను డంపింగ్ యార్డుకు ట్రాక్టర్ ద్వారా తరలించారు. చెత్త తరలింపుతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

గాంధారి, మార్చి 11: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బూర్గల్ గ్రామ నర్సరీని ఆయన సోమవారం పరిశీలించారు. జూన్ నెలలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివక్ష లేని సమాజ నిర్మాణానికి బసవేశ్వరుడి కృషి : ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్, మార్చి 11: వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం బసవేశ్వర మహరాజ్ కృషి చేశారని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్‌లో ఏర్పాటు చేసిన బసవేశ్వరుడి విగ్రహాన్ని ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బసవేశ్వరుడు చేసిన బోధనలు సదా ఆచరణీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యశోదా నీలూ పటేల్, మాజీ సర్పంచ్ రాములు సేట్, దాదారావు పటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయాగౌడ్, శ్యామప్ప పటేల్, ఉమాకాంత్ పటేల్, రాజు పాల్గొన్నారు.

ఐసీయూ ప్రారంభం..

బిచ్కుంద ప్రభుత్వ దవాఖానలో భారత్ పెట్రోలియం సౌజన్యంతో మార్పు ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

ఐసీయూను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
పిట్లం శాఖ
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ–వేలం అమ్మకం ప్రకటన.
వజహత్ ఏజెన్సీస్ రుణగ్రహీతలు మరియు హామీదారులు నుండి సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పిట్లం శాఖ**కు బకాయి 25–10–2022 నాటికి **రూ. 80,92,611** + వడ్డీ+ ఇతర చార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పిట్లం శాఖ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి ''ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా'' మరియు ''అక్కడ ఏమున్నదో అదే'' ప్రాతిపదికన **27.03.2024**న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. రిజర్వు ధర: **రూ. 1,06,52,000/-** మరియు బయానా డిపాజిట్: **రూ. 10,65,200/-**
రుణగ్రహీత: M/s. వజహత్ ఏజెన్సీస్, యజమాని శ్రీ మీర్ వజహత్ అలీ, చిరునామా: బ్లైట్ స్కూల్ దగ్గర, ఈద్గా రోడ్, పిట్లం (గ్రా&మం), కామారెడ్డి జిల్లా, తెలంగాణ–503310.
హామీదారు: శ్రీమతి రజియా సుల్తానా, భర్త లేట్ అయూబ్ అలీ, చిరునామా: ఇం.నం. 9–96/8/A3, బ్లైట్ స్కూల్ దగ్గర, ఈద్గా రోడ్, పిట్లం (గ్రా&మం), కామారెడ్డి జిల్లా, తెలంగాణ–503310.
న్యాయోచిత తనఖాపెట్టిన ఆస్తి: శ్రీమతి రజియా సుల్తానాకు చెందిన ఈద్గా రోడ్, శ్రీసాయి స్కూల్ ప్రక్కన తెలంగాణ – 503310, కామారెడ్డి జిల్లా, పిట్లం గ్రామం మరియు మండలంలో గల సర్వే నం. 916/Aలో ఇం.నం.